# స్టార్ వార్స్

అది క్రీస్తుశకం 99,999వ సంవత్సరం డిసెంబరు, ముప్పై ఒకటవ తేదీ. వంద కిలోమీటర్ల విస్తీర్ణంలో ఎనిమిది వేల అంతస్తుల భవనంలో ఆఖరు అంతస్తులో రాడార్ స్క్రీన్ ముందు కూర్చుని ఉన్న ఎర్త్ అడ్మినిస్ట్రేటివ్ కంట్రోలర్ శంకర్ ఉలిక్కిపడ్డాడు.

"మిస్టర్ 'జె' అప్పియర్" అన్నాడు.

కంప్యూటర్ ముందు కూర్చొని ఉన్న రాబోట్ మిస్టర్ 'జె' స్క్రీన్ మీద ప్రత్యక్షమయింది.

"మిస్టర్ 'జె' దక్షిణ అమెరికాలోని అమెజాన్ ప్రాంతంలో అగ్నిపర్వతం కదులుతూ ఉంది. రెండు నిమిషాల్లో అది పేలిపోవచ్చు. రిమువ్ ఇట్ అండ్ రిప్లేస్ ది ఏరియా".

రాబోట్ 'జె' వెంటనే తన ముందున్న బటన్స్‌ని అటూ ఇటూ నొక్కింది. క్షణంలో అమెజాన్ ఫారెస్టు ఏరియా కనబడింది. ఆ దట్టమైన అరణ్యంలో అయిదు వందల కిలో మీటర్ల విస్తీర్ణం వ్యాపించి ఉందా పర్వతం. అదే గనుక పేలితే దక్షిణ అమెరికా దేశ జనాభా సగం మంది మాత్రమే మిగులుతారు. మిగతా సగం మనకు బూడిద రూపంలో సాక్షాత్కరిస్తారు.

రాబోట్ మిస్టర్ 'జె' బ్రౌన్ కలర్ లీవర్‌ని క్రిందకి అదిమి, రెడ్ కలర్ బటన్‌ని ప్రెస్ చేసింది. అంతే! చూస్తుండగానే హైపవర్ సూపర్‌సానిక్ రేస్ పర్వతం చుట్టూ వర్తులాకారంలో ఆరువందల కిలోమీటర్ల విస్తీర్ణాన్ని పదివేల అడుగుల లోతుకు క్షణాల్లో కేకును కోసినట్టు కోసేసింది. రాబోట్ మళ్లీ లీవర్‌ని పైకి లేసింది. అంతే! ఒక గుండ్రని టాబ్లెట్‌లా ఆ పర్వతం ఆకాశంలోకి లేచింది. రాబోట్ సూచించిన దిశవైపు వేగంగా ప్రయాణించింది. సరిగ్గా ఫసిఫిక్ ఓషన్ దగ్గరకు రాగానే లీవర్‌ని క్రిందికి ప్రెస్ చేసింది. అంతే! ఎర్రగా నిప్పు కణికలా ఉన్న అంత పెద్ద పర్వతమూ ఫసిఫిక్ ఓషన్‌లో పడిపోయింది. వెంటనే సముద్రంలో భయంకరమైన అల్లకల్లోలం. లక్షల టన్నుల బరువుగల తిమింగళాలు బొగ్గు ముక్కల్లా మాడి నీళ్లమీద తేలసాగాయి. రాబోట్ వెంటనే దక్కన్ పీఠభూమిలోని ఒక ప్రదేశాన్ని సెలక్ట్ చేసుకొని మళ్లీ సూపర్ సానిక్ రేస్‌తో దాన్ని బ్రెడ్‌ని కోసినట్లు కోసి పర్వతం తొలగించిన స్థలంలో దాన్ని రిప్లేస్ చేసింది. అంతా ఒకటిన్నర నిముషంలో జరిగి పోయింది.

రాడార్ స్క్రీన్‌లోంచి అంతా చూస్తున్న శంకర్ తృప్తిగా తలాడించి కుర్చీలోంచి లేచాడు. వరండాలోకి వచ్చి జేబులోంచి అగ్గిపెట్టెలాంటి వస్తువు తీసాడు. దాని మీద చిన్న చిన్న బటన్స్ ఓ నాలుగున్నాయి. జేబులోంచి సన్నని మొన ఉన్న బాల్‌పెన్ లాంటిది తీసి దాంతో రెండు బటన్‌లు ప్రెస్ చేశాడు. అంతే! దాంట్లోంచి సన్నని రేస్ బయటికి వచ్చాయి. మరుక్షణంలో ఆ రేస్ అన్నీ కూడగట్టుకొని ఒక చిన్న ఫైబర్ గ్లాస్ వాహనంగా తయారయింది.

శంకర్ అందులో కూర్చుని ప్రెస్ చేశాడు. అది సెకండుకు వెయ్యి కిలోమీటర్ల వేగంతో అక్కడికి పాతిక వేల కిలోమీటర్లలో ఉన్న అతని నివాసానికి అర నిముషంలో చేర్చింది.

2

అతనా విశాలమైన హాల్లో అడుగు పెట్టే సరికి అప్పటికే అతని కుటుంబ సభ్యులు కూర్చొని మాట్లాడుకొంటున్నారు. శంకర్ వెళ్ళి భార్య నాన్సీ ప్రక్కన కూర్చున్నాడు.

"ఏమ్మా? ఎంత వరకు వచ్చింది నీ పరిశోధన?" అడిగాడు పెద్ద కుమార్తె సౌమ్యను. ఆమె రోజూ చంద్రమండలం వెళ్ళి అక్కడ పరిశోధనశాలలో ఒక క్రొత్త నక్షత్రాన్ని కనుగొనే పనిలో ఉంది. రోజూ నాలుగు గంటలపాటు అక్కడ పరిశోధన చేసి తరువాత తిరిగి వస్తుంటుంది. ఆమె ప్రయాణ సమయం పోను అయిదు నిముషాలు, రాను అయిదు నిముషాలు మాత్రమే.

"చాలా వరకు పూర్తయింది డాడీ. కొత్త నక్షత్రం ఉనికి, దాని వాతావరణం పరిస్థితులు మొదలైన డేటా అంతా నోట్ చేసుకొన్నాను. కాస్మోస్ రేస్ పంపి అక్కడ నివాసానికి అనుకూలంగా కూడా చేసాను. ఒక డేట్ ఫిక్స్ చేసుకొని ఇష్టపడ్డవాళ్లని అక్కడకు పంపడమే"

"నా కూతురువనిపించావు సౌమ్యా. మన ఎర్త్‌కి అది ఎంత దూరంలో ఉంది తల్లీ" అన్నాడు అనందంగా.

"మూడువేల కోట్ల లైట్ ఇయర్స్ దూరం డాడీ"

"ఐ.సీ." అన్నాడు శంకర్ ఏదో ఆలోచిస్తూ.

లైట్ ఇయర్ అంటే కాంతి సెకండుకి రెండు లక్షలా డెబ్బై ఆరు వేల కిలోమీటర్ల వేగంతో ఒక సంవత్సరం కాలంలో ప్రయాణించే దూరాన్ని లైట్ ఇయర్ అంటారు.

"డియర్ నీ రిపోర్ట్సు తయారయ్యాయా?" అడిగాడు ప్రక్కనున్న భార్య నాన్సీని.

ఆమె కొన్ని కోట్ల లైట్ ఇయర్స్ దూరంలో ఉన్న ఒక స్టార్‌ని ఎన్నుకొని "వాటీజ్ ఇన్‌సైడ్ ది స్టార్" అనే సబ్జక్టు మీద పరిశోధన చేస్తోంది.

అందమైన నాన్సీ చిరునవ్వు నవ్వుతూ "అయిపోయాయి శంకర్. రేపే ఇంటర్ ప్లానెట్ అసోసియేషన్‌కి రిపోర్టు సబ్మిట్ చేస్తాను" అంది.

శంకర్ అనందంగా భార్యకు షేక్ హాండిచ్చి గ్రీట్ చేసాడు.

ఆమెకు త్వరలో ఇంటర్ ప్లానెట్ అసోసియేషన్ వాళ్లు అవార్డు ఇవ్వవచ్చు. దాంతో యూనివర్స్‌లో ఉండే అన్ని గ్రహవాసులలోనూ ఆమె పేరు మ్రోగిపోతుంది.

"డాడీ! డేవిడ్ బ్రదర్ ఇందాకే మాట్లాడాడు" అన్నాడు శంకర్ ఆఖరి కుమారుడు వెంకట్.

"ఏమయినా అంతు పట్టిందని చెప్పాడా?"

"ప్చ్, లేదట" చిన్నగా నిట్టూర్చి చెప్పాడు.

శంకర్, నాన్సీల పెద్ద కుమారుడు డేవిడ్. అతను మరో నలుగురు స్నేహితులతో కలసి 'వాట్ ఈజ్‌ది ఎండ్ ఆఫ్ ది యూనివర్స్' అనే విషయం మీద పరిశోధన నిమిత్తం ఆరు నెలల క్రితం బయలు దేరాడు. సెకండుకు మూడు వేల కోట్లలైట్ ఇయర్స్ వేగంతో ప్రత్యేక వాహనంలో ఆరు నెలలుగా ప్రయాణిస్తున్నా ఇప్పటికీ అతను తన పరిశోధనలో ఒక పర్సెంటుకూడా ముందుకు పోలేదు.

నిజానికి ఇది సాహస కార్యమే. యూనివర్స్ అనేది ఓపెన్ చేయబడిన మార్గం లాంటిది. అది ఇన్‌ఫినిట్. దానికి అంతమంటూ లేదు. రబ్బరు బెలూను ఊదితే ఎలా అంతకంతకూ పెద్దదవుతుందో యూనివర్స్ కూడా అంతే. పోయే కొద్దీ విశాలమవుతుందే తప్ప దానికి చివర అంటూ ఉండదు.

"డాడీ ఏదైనా విషయం చెప్పూ" అంది శంకర్ చిన్న కుమార్తె ప్రియ.

3

శంకర్ తను కూర్చున్న టేబులు డ్రాయరులోంచి సెంటీమీటరు వైశాల్యమున్న కాయిన్ లాంటిది తీసి రాడార్ స్క్రీన్ ప్రక్కనే ఉన్న హోల్లో వేసి స్విచ్ నొక్కాడు. వెంటనే స్క్రీన్ మీద బొమ్మలు కనిపించాయి.

ఆ చిన్న టాబ్లెట్‌లో కొన్ని లక్షల సంవత్సరాల కాలం నిక్షిప్తం చేయబడిఉంది. అలాంటి టాబ్లెట్‌లు ప్రతి ఇంట్లోనూ ఉంటాయి. కాలక్షేపం కోసం అప్పుడప్పుడు ఆకాలాన్ని చూసుకుంటుంటారు.

స్క్రీన్ మీద మండుతున్న ఒక గ్రహం కనిపించింది. తరువాత అది ముక్కలు ముక్కలు కావడం కనిపించింది. కాల క్రమంలో ముక్కలన్నీ చల్లారి గట్టిపడ్డాయి ఒక్కటి తప్ప. ఆ ఒక్కటి సూర్యుడు. మిగిలినవి భూమి, మెర్క్యురీ, వీనస్, మార్స్, జూపిటర్, శాటన్, నెప్ట్యూన్, ప్లూటో అనే తొమ్మిది గ్రహాలు. ఇవన్నీ సూర్యకుటుంబం లోనివి గ్రహాలు. మళ్లీ వాటికి కొన్ని ఉప గ్రహాలుగా ఏర్పడ్డాయి. అలా ఏర్పడ్డ గ్రహాల్లో భూమికి ఒకే ఉపగ్రహం ఏర్పడింది. అదే చంద్రుడు. ఈ ఉపగ్రహాల చుట్టూ కొని వందల ఏస్టరాయిడ్స్, వీటి చుట్టూ కొన్ని వేల కోమెట్స్, ఇవన్నీ విశ్వంలో నిర్ణీత కక్ష్యలో తిరగసాగాయి. ఇలాగే ఆకాశంలో గుంపులు గుంపులుగా కనిపించే నక్షత్రాలను పాలపుంతలంటారు. అలాంటి గెలక్సీలు కొన్ని కోట్ల కోట్లు ఈ విశాల విశ్వంలో ఉన్నాయి. 'లా ఆఫ్ యూనివర్సల్ గ్రావిటేషన్' ప్రకారం ఒక నక్షత్రం మరొక దాన్ని ఢీకొనకుండా ఒక క్రమ పద్ధతిలో తిరుగుతుంటాయి. విశ్వంలో తొంభైఎనిమిది పర్సెంటు నక్షత్రాలతో నిండి వుంటే మిగతా రెండు పర్సెంటు ఒక రకమైన గ్యాస్, డస్ట్‌తో నిండి వుంటుంది. దీన్ని 'నెబులా' అంటారు. దీనివల్లనే ఆకాశం మనకు

నీలంగా కనిపిస్తుంది. నక్షత్రాలు సూర్యుడి కంటే కొన్ని లక్షల రెట్లు కాంతి వంతమైనవి. అవి ఎన్నో కోట్ల లైట్ ఇయర్స్ దూరంలో ఉండడంతో మనకంటికి మినుక్కు మినుక్కుమంటూ చుక్కల్లా కనిపిస్తున్నాయి.

భూమ్మీద సముద్రాలు ఏర్పడటం, ఏక కణ జీవి బహు కణ జీవిగా మారడం ఇంకా ఇతరత్రా జీవజాలం ఏర్పడడం. అనాది మానవుడి స్థితిగతులు, తరువాత రాజులు, రాజ్యాలు, తరువాత డెమొక్రాటిక్ కంట్రీస్ ఏర్పడడం అన్నీ స్క్రీన్ మీద కనిపించసాగాయి. ఇక ఖగోళ శాస్త్ర పరిశోధనలో టోలమి, కోపర్నికస్ అనే శాస్త్రవేత్తలు ఆద్యులు.

స్క్రీన్ మీద ప్రథమ స్వాతంత్ర్య సమర యోధుడు మహాత్మాగాంధీ కనిపించగానే శంకర్, నాన్సీల శరీరాలు ఆనందంతో పులకించి పోయాయి. పిల్లలు సంతోషంగా చప్పట్లు కొట్టారు. నిరాయుధుడైన తాతగారు, అంత బలమైన బ్రిటిష్ వాళ్లని సత్యాగ్రహంతో ముప్పుతిప్పలు పెట్టి మూడు చెరువుల నీరు త్రాగించి జయించడం వాళ్లకో మరపురాని అనుభూతి.

తరువాత స్క్రీన్‌లో ఒక ఆఫీసులోని గుమస్తాలు పనిచేసే దృశ్యం కనిపించగానే "డాడీ స్టాపిట్. ఐ కెనాట్ బేర్" అంటూ అరచింది ప్రియ.

"ఏం తల్లీ"

"డాడీ మనుషులు పని చేయడం ఏమిటి? రాబోట్స్ ఏమయ్యాయి" బాధగా కళ్లు మూసుకొని అంది.

" అన్యాయం కాదు తల్లీ. ఆ రోజుల్లో న్యాయమే".

"మనుషులు పనిచేయడం మొదలు పెడితే వాళ్లు సుఖ పడేదెప్పుడు డాడీ"

"నిజమే తల్లీ సుఖపడాలంటే డబ్బు కావాలి. ఆ డబ్బుకోసం కష్టపడుతున్నారు. అలా తమ జీవితమంతా కష్టపడడంలోనే గడిపేసేవాళ్లు" అసలు విషయం చెప్పాడు.

ఇరవయ్యవ శతాబ్దం, తొంభయ్యవ శతాబ్దం మధ్యకాలంలో ప్రపంచం సైంటిఫిక్‌గా చాలా ముందుకు పోయింది. ఎన్నో కొత్తగ్రహాలను నక్షత్రాలను కనుగొని అక్కడ నివాస మేర్పరచుకొన్నారు. అంతేగాక ఎన్నో కాంతి వంతంగా వెలిగే నక్షత్రాలను ఆర్పివేసి అక్కడా నివాసాల్ని ఏర్పరచుకొన్నారు. చావును జయించారు. ఇప్పుడు దేశాధినేతలు లేరు. ఒక్కో గ్రహాన్ని ఒక్కొక్కరు పాలిస్తున్నారు. ఒక గ్రహం చేరడానికి నిమిషాల వ్యవధి చాలు. అందుకే ఈనాటి పిల్లలకు ఇరవైవ శతాబ్దపు విషయాలు చాలా ప్రిమిటివ్‌గా కనిపిస్తాయి.

"డాడీ అది ఏమిటి? వానపాములా పాకుతోంది?" అరిచాడు చిన్న కుమారుడు స్క్రీన్‌లోకి చూస్తూ.

"అది వానపాము కాదు బాబూ. తమిళనాడు ఎక్స్‌ప్రెస్"

"దానివేగం సెకండుకు ఎన్ని లక్షల లైట్ ఇయర్స్ డాడీ?"

"సెకండుకు కాదు బాబూ గంటకు నూటయాభై కిలో మీటర్లు"

"ఓ మైగాడ్. అయితే ఆ వేగంతో మనకు అత్యంత సమీపంలో ఉండే చంద్రమండలం చేరే సరికి అనాటి జీవన ప్రమాణాన్ని బట్టి కొన్ని వేల జనరేషన్లు రైల్లోనే పుట్టి రైల్లోనే మరణిస్తాయన్నమాట. ఎంత బార్బేరియస్ లైఫ్ అనుభవించారు ఆనాటి ప్రజలు"

4

సడన్‌గా స్క్రీన్ మీద ఎమర్జెన్సీ లైటు వెలిగింది. వాళ్లున్న అంతస్తు సెకండుకు కొన్ని కోట్ల లైట్ ఇయర్స్ వేగంతో విశ్వంలోకి ఎగిరి పోసాగింది. దానికి కారణం ఎర్త్ కంట్రోలర్ శంకర్, అతని కుటుంబ సభ్యులకు మాత్రమే తెలుసు.

ప్రస్తుతం విశ్వంలో రాజకీయాలు సరిగా లేవు. మిత్రగ్రహాలయిన ఎర్త్, వీనస్, జూపిటర్, యురేనస్ నెప్ట్యూన్, చంద్రుడు, ఇంకా సిరియస్, అల్టైయర్, వేగా, కాస్టర్, కాపెల్లా, రెగ్యులస్, స్పైకా మొదలయిన నక్షత్రాలు ఒకవైపు, శత్రుగ్రహాలయిన సూర్యుడు, మెర్క్యురీ, మార్స్, సాటర్న్, ప్లూటో ఇంకా మరికొన్ని నక్షత్రాలు ప్రోకియాన్, పామాటట్, పొల్లక్స్, అల్డెబారన్, డినెబా ఒక వైపు చేరి ఒకరి వైపు ఒకరు కాలుదువ్వుకుంటూ స్టార్‌వార్స్‌కి ప్రయత్నాలు చేస్తున్నారు. అందుకే అప్పుడప్పుడు ఒక్కో గ్రూపు గ్రహాధినేతలు ఒక్కో చోట చేరి రహస్య సమాలోచనలు చేస్తుంటారు.

ఇప్పుడు ఎర్త్ అడ్మినిస్ట్రేటివ్ కంట్రోలర్ శంకర్‌కు అలాంటి రహస్య సమాచారం అందటంతో ఆటోమేటిక్‌గా అతని గది సెకండుకు కొన్ని లక్షల లైట్ ఇయర్స్ వేగంతో, అతన్ని సుదూరంలో నున్న సదరు రహస్య సమావేశం జరిగే స్టార్ వైపు తీసుకు పోసాగింది.

పది నిమిషాల్లో ఆ స్టార్ మీద దిగాడు. అతని గది ఆ భవనం చేరగానే గదిలోంచి బయటికి వచ్చి ప్రక్కనే రహస్య సమావేశం జరిగే హాల్లో కూర్చున్న మిత్రగ్రహాల అడ్మినిస్ట్రేటర్స్‌ని అందర్నీ గ్రీట్ చేసాడు. రెండు నిమిషాల్లో సామావేశం పూర్తయింది. బ్రెయిన్ ట్రాన్స్ ప్యూజన్ ద్వారా ఒకరి కొకరు ఈ కొద్ది సమయంలో ఎన్నో లక్షల విషయాలు మాట్లాడుకొన్నారు. వీటి సారాంశం సరిగ్గా అరగంట తరువాత శత్రు గ్రహాల్ని సర్వనాశనం చేయడం.

కాని వీళ్లు లేవబోతుండగా కొన్ని నిమిషాల్లో శత్రుగ్రహాల వాళ్లు మిత్రగ్రహాల మీద దాడి చేయబోతున్నట్టుగా మెసేజ్ అందింది. అలర్టయి పోయిన గ్రహాధినేతలు క్షణాల్లో తమ వాహనాల్లో చేరి తమ గ్రహాలకు ఇన్ఫర్మేషను అందించి తప్పించుకు పొమ్మని హెచ్చరించారు.

తిరుగు ప్రయాణంలో మహా వేగంతో రెండు నిమిషాల్లో భూమిని చేరుకొన్నాడు శంకర్.

కాని అప్పటికే కాలం మించిపోయింది. సూర్య గ్రహం నుంచి వెలువడిన సన్నని కాంతి కిరణాలు భూమిలోకి చొరవడి అంత కంతకూ విశాలమై భూమిని రెండుగా చీల్చివేసాయి. భూమి ముక్కచెక్కలై పోయింది. శంకర్ వూరుకోలేదు. మరుక్షణంలో తన జేబులోంచి సిగరెట్ లాంటిది తీసి సూర్యుడికి గురిపెట్టాడు. అందులోంచి దూసుకు వెళ్ళిన రేస్ గ్రహాన్ని ఫెటిల్లుమని పగుల గొట్టాయి. మరుక్షణంలో సూర్యగ్రహం బూడిదగా మారిపోయింది.

క్రమేణా స్టార్‌వార్ తీవ్రమయింది గ్రహాధి నేతలంతా శూన్యంలో నిలబడి తమశత్రు గ్రహాలమీద దాడులు మొదలు పెట్టారు. వీనస్ మెర్క్యురీనీ షూట్ చేస్తే, మార్స్‌ని నెప్ట్యూన్ పొడిగా మార్చేసింది.

ఇలా గ్రహాలు బ్రద్దలవుతున్నాయి. బెలూన్లలా పేలిపోతున్నాయి. కొన్ని ముక్క చెక్కలవుతున్నాయి. కొన్నిబూడిదవు తున్నాయి. ముక్కలయిన గ్రహాల్ని బ్లాక్ హోల్ తనలోకి లాక్కుంటోంది.

ఓ అరగంట గడిచేసరికి అక్కడ ఒక్క గ్రహం మిగలలేదు. మిత్ర గ్రహాధినేతలు, తప్పించుకొన్న గ్రహవాసులు విశ్వంలో తమతమ వాహనాల్లో ఒకవైపు చేరితే, శత్రు గ్రహాధినేతలు వాళ్ల గ్రహాల్లో బ్రతికి బయటపడ్డ కుటుంబాలు మరోవైపు చేరారు.

దూరం నుంచి రెండు వర్గాల గ్రహవాసులు ఒకరివైపు మరొకరు కసిగా, అసహ్యంగా చూసుకొన్నారు.

అంతే, మరో నిమిషంలో మిత్రగ్రహాధి నేతలు, వాళ్ల అనుచరులు తమ నివాసానికి క్రొత్త నక్షత్రాలను వెతుక్కుంటూ ఒక దిక్కుకు ప్రయాణమయిపోతే, శత్రు గ్రహాధి నేతల్లు, వాళ్ల గ్రహవాసులు దానికి వ్యతిరేకదిశలో వేగంగా ప్రయాణించసాగారు ✸

**(తెలుగు విద్యార్థి మంత్లీ, మార్చి, 2000)**